పెరిగింది.

* * *

గత మూడు నెలలుగా శ్యామల రాకతో యింట్లోనే కాక కొడుకులో వచ్చిన మార్పు జమిందారిణికీ తెలుస్తూంది. ఎంత మంచంలోంచి కదలలేనిది అయినా యింట్లో జరుగుతున్న విషయాలు కొన్నివిని - కొన్ని చూసి ఆవిడా గ్రహించింది. శ్యామలపట్ల రంగారావుచూపే శ్రద్ధాసక్తులకి కారణం ఆవిడకి బోధపడి నట్లయింది. ఎవరో కులమో గోత్రమో తెలియని దాన్ని తీసుకొచ్చి అందలం ఎక్కించడం తోనే ఈ విషయం సరిపోదన్నది ఆవిడకి తట్టింది-శ్యామల కార్యదక్షత-శ్యామల మంచితనంమీద ఆవిడకేం అపనమ్మకం లేదుగాని ఓ ఉద్యోగస్థురాలిని స్థానంనుంచి శ్యామలకు యింకేం ఇవ్వడం ఆవిడ కిష్టంలేదు. వూరుకుంటే ఈ వ్యవహారం చాలా దూరం వెళ్ళే సూచనలు గురించి ఆరోజు ఆవిడ అందుకే రంగారావుకి కబురు పంపింది. అందుకే ముందురోజు రంగారావు వేటకి శ్యామలనికూడా తీసుకు వెళ్ళా డన్న వార్త అందాక ఆవిడింక ఉపేక్షించ దలచలేదు

"అమ్మా .... ఎందుకు రమ్మన్నారు ?" వంట్లో కులాసాగా వుందికదా - రంగారావు అడిగారు. జమిందారిణి కొడుకుని ఆపాదమస్తకం సూటిగా పరీక్షిస్తూ, 'నా వంట్లో కులాసాకి ఏంలే-నిన్నో విషయం అడగాలని అనుకుని పిలిచాను'?- గంభీరంగా అంది. రంగారావు ఒక్కక్షణం ఆశ్చర్యంగా తల్లిని పరికించి చూసాడు.

"అడగండి-దానికింత సందేహం ఎందుకు ?"

"శ్యామలని తీసుకుని నిన్న ఎక్కడికో వెళ్ళినట్టున్నావు ?" ఆవిడ సూటిగా చూసింది.

రంగారావు మొహం క్షణకాలం యెర్రబడింది-"ఆ....అవును. వేట చూడా లని వుందని ఒకసారి అంటే తీసికెళ్ళాను...." మామూలుగా జవాబిచ్చాడతను.

"నీ కింద పనిచేసే వారిని అందులో ఒక యువతిని అలా తీసుకెళ్ళడం అను చితం అనిపించలేదా ? మన మెవరమో-మన హోదా - పరువు ప్రఖ్యాతులెలాంటివో మరిచి పోయావా ? నీ కింద పనిచేసే దానితో నీ యీ చనువు గురించి నలుగురూ ఏమనుకుంటారోనన్నది గ్రహించావా ?" గంభీరంగా అడిగింది. రంగరావు మొహం మరింతఎర్రబడింది చిన్న పిల్లాడిని దండించినట్లు తనంత వాడైనా తనని తల్లి అలా నిలదీయడం చిన్నతనం అన్పించింది. అయినా తల్లితో అమర్యాదగా మాట్లాడలేక"

ఎవరు ఏమనుకునేది నాకు లెక్కలేదు.

"నీకు లెక్కలేక పోయినా అందరికి లెక్క వుంటుంది. ఓ పెళ్ళికాని యువతితో నీ చనువు ఎవరూ హర్షించరు. ఎవరో తెలియని ఓ అనాధని వెంట బెట్టుకు వచ్చావు. సరే పనికి కుదిర్చావు. పని చేస్తూంది, బాగుంది – అంతేకాని ఆమె స్థానంలో ఆమెని వుంచకుండ యింటి యిల్లాలుని మించిన చనువు, స్థానం యివ్వడంలో నలుగురూ ఎలా మాట్లాడుతారో ఊహించలేవా? ఈ అమ్మాయి వచ్చాక యింట్లో వచ్చిన మార్పులు గ్రహిస్తున్నాను. ఏ నాటినుంచో మన ఆశ్రయంలో వున్న నౌకర్లని వెళ్ళగొట్టావు. నేను కలుగజేసుకోలేదు. ఈ అమ్మాయి యిల్లంతా ఓ యిల్లాలులా చక్కదిద్దుతూంది. సరే మంచేగదా చేస్తుంది అని నేను పట్టించుకోలేదు. కాని ఆమెతో నీ చనువుని హర్షించలేను. ఆమె స్థానంలో ఆమెని వుంచమని చెప్పడానికే పిలిపించాను. ఆమె హద్దులో ఆమె వుంచు. అది ఆమెకీ మనకీ మంచిది. గంభీరంగా అంది జమీందారిణి. రంగరావు ఆవేశం బలవంతాన అణుచుకున్నాడు. ఒక్క క్షణం ఆలోచించి ఏదో స్థిర నిశ్చయం చేసుకున్నవాడిలా తలపంకించాడు

"సరే, ఆమె స్థానంలో ఆమెని ఉంచుతాను. నలుగురూ ఏమనుకునే అవకాశం ఇవ్వను" అన్నాడు స్థిరంగా రంగారావు. జమీంధారిణి అర్థంకానట్టు చూసింది. రంగారావు తల్లి వంక చూసి "శ్యామలని నేను వివాహం చేసుకుని యీ ఇంట్లో ఎవరూ నోరెత్తలేని స్థానం ఇస్తాను. అప్పుడింక మీకు అభ్యంతరం ఉండదు గదా" గంభీరంగా అన్నారు. జమీందారిణి తెల్లబోయింది.

"ఏం మాట్లాడుతున్నావో తెలుసా? నీవెవరో, శ్యామల ఎవరో గుర్తుండే మాట్లాడుతున్నావా?" కాసేపటికి అనగలిగింది కోపం పట్టలేక – "ఎక్కడ పుట్టిందో – ఎవరికి పుట్టిందో తెలియకుండా అనాధగా పెరిగిన ఆమెని జమీందారిణి చేస్తావా?"

"హు! జమీందారిణి – జమీందారీలు ఇంకా ఉన్నాయా మనకి." రంగారావు అదోలా నవ్వారు.

"జమీందారీ లేకపోయినా మన వంశం – పరువు ప్రతిష్టలు మిగిలే వున్నాయి మన తాహత ఎలాంటిదో కూడా గుర్తులేకుండా పోయాయా నీకు?" కటువుగా అంది.

రంగారావు విరక్తిగా "ఇన్నాళ్ళు వివాహం చేసుకోమని విసిగించారు. తీరా నేను చేసుకుంటానంటే అభ్యంతరం చెపుతున్నారు?" అన్నారు.

"అవును వివాహం చేసుకోమన్నాను. అయినింటి, మనవంశ మర్యాదకి సరిపోయే అమ్మాయిని చేసుకోమని అర్థంగాని - యిలా ఓ అనాధని - అనామికని చేసుకోమనిగాదు- "తీవ్రంగా అంది ఆవిడ -" అమ్మా మీకు నా వయసు నలభై సంవత్సరాలని - నా వయస్సు చూసి ఏ గొప్పవాళ్ళు తమ ముద్దుబిడ్డని రెండో వివాహనికి యివ్వరన్నది గుర్తులేదా జమీందారిణి ఒక్క క్షణం సంశయంలో పడింది. డబ్బులేని పిల్ల అయినా సద్వంశ, సచ్చరిత్ర కలిగిన పిల్లలు కావాలంటే దొరక్కపోరు. నిమిషాలమీద కుదర్చగలను. ఎంత రెండో పెళ్ళి అయినా మన హోదా చూసి పిల్ల నిచ్చేందుకు అనేకులు తయారుగా వుంటారు."

"కాని నేను తయారుగాలేను. నేను వివాహం చేసుకోవాలని మీరనుకుంటే శ్యామలనే చేసుకుంటాను - లేదంటే యిలాగే వుంటాను. బాగా ఆలోచించి రేపు జవాబివ్వండి. రంగారావు తన నిశ్చయం తెలియజేసి మరేం మాట్లాడడానికి అవకాశం యివ్వలేదు జమీందారిణి మొఖం అరుణిమదాల్చింది.

"పరువు ప్రతిష్టలకోసం ప్రాణం పెట్టే నీవే యిలా మాట్లాడడం నే సహించని విషయం. పరువు ప్రతిష్టలకోసం అందరికి అన్నీ చెప్పి నీవిలా మారిపోతావని నే ననుకోలేదు. ఇదంతా ఆ శ్యామల వల్లే గదా' ఆవిడ నిష్టూరంగా కటువుగా అంది.

"పరువు ప్రతిష్ఠలకుభంగం కల్గే పనులు నేనేం చెయ్యలేదని నా నమ్మకం. మీకూ అ నమ్మకం వుంటే ఈ వివాహం జరుగుతుంది. ఆలోచించి చెప్పండి." రంగారావు విసురుగా వెళ్ళిపోయాడు. ఆ రాత్రి జమీందారిణికి జబ్బు తిరగ పెట్టింది. మాట పూర్తిగా పడిపోయింది, కుడివైపంతా పక్షవాతంతో పూర్తిగా చచ్చుపడిపోయింది.

తరువాత నెల రోజులలో రంగారావు శ్యామలని వివాహం చేసుకున్నాడు. ఏ ఆర్భాటం లేకుండా రిజిష్టర్ మేరేజ్ చేసుకున్నారు. ఆ వివాహం ఆయన బంధుమిత్ర వర్గాలలో సంచలనాన్నే కల్గించింది.

జమీందారిణి ఆఖరికి తన సమ్మతి తెలియ చెప్పక తప్పలేదు. ఎంత ఆలోచించినా అంతకు మించి మరో మార్గం కనపడలేదు. కొడుకు పంతం పట్టుదలతెల్పిన

ఆవిడ ఆమోదించక తప్పలేదు, శ్యామల వచ్చాక కొడుకులో ఎంత మార్పు వచ్చింది చూశాక – కాదంటే తిరిగి అతను ఏ విధంగా మునుపటిలా తయారవుతాడో ఊహించి – చూస్తూ చూసూ కొడుకు జీవితం పాడవుతూంటే సహించలేనని, తమ వంశం నిర్వంశం అవడం సహించక ఆవిడ మనసు సరిపెట్టుకుని అంగీకరించాల్సి వచ్చింది.

రంగారావు శ్యామలకీ తన అభిప్రాయాన్ని చెప్పగానే శ్యామల ముందు తెల్లపోయింది. ఆశ్చర్యంతో మాట రాలేదు–తరువాత ఆమె కృతజ్ఞతతో ఆనందంతో ఆయన పాదాలు పట్టుకుంది. తనలాంటి దానిపట్ల ఆయన అభిమానానికి ఆమె పూర్తిగా చలించిపోయింది. అంత అదృష్టం తనకి పడుతుందని అనుకోలేదు. నమ్మలేను అంటూ పదే పదే కళ్ళు తుడుచుకుంది. "ఇది అదృష్టమని భావిస్తున్నావా శ్యామలా, నా వయసువాడితో రెండో వివాహం చేసుకొనే వాడితో పెళ్ళి అదృష్టం అనుకుంటున్నావా ?' అన్నారాయన అభిమానంగా.

"యింత గొప్పింటి కోడలని అవడం మీ సహచర్యం పొందడం మీ నీడన విశ్రాంతిగా జీవితం వెళ్ళిపోవడంకంటె నాలాంటి అభాగ్యురాలు కోరుకునే అదృష్టం ఇంకేముంటుంది–ఎక్కడ పుట్టానో, ఎలా పెరిగానో తెలియని నికృష్ట జీవితం గడిపిన నాకు యిది అదృష్టం కాదంటారా–కాదని మీరన్నా నేను అనుకోను–అనుకోలేను–మీలాంటి భర్తని పొందగలగడం పూర్వజన్మ సుకృతం–మీ జుట్టు నెరవచ్చు–కాని మీ మనసుకి ముసలితనం రాలేదని నాకు తెలుసు – కేవలం వయసు ఒక్కటే కాదు వివాహానికి కావల్సింది–మనసు ముఖ్యం – అది మీరిస్తున్నారు. నా కింకేం కావాలి. కాని ఇందుకు మీ అమ్మగారు సమ్మతించరు–మీ బంధువర్గం ఒప్పుకోరు. అందరి మనసులు ఈ నిర్భాగ్యురాలికోసం నొప్పించవద్దు. మీరింత నీడ యిచ్చారు అది నాకు చాలు–' అంటూ వారించబోయింది.

"ఎవరో ఏదో అంటారని, అనుకుంటారని యీ రత్నాన్ని జారవిడవను శ్యామలా! చీకటైపోయిన నా బతుకులో వెలుగు నింపావు. చేతులారా ఈ వెలుగుకి దూరమై చీకట్లో తడుములాడుతూ ఇంకా బతికే ఓపిక లేదు శ్యామలా! మిగతా విషయాలు నీ కనవసరం. నీ అంగీకారం ఒక్కటిస్తే చాలు నాకు" అన్నారు రంగారావు.

శ్యామల ఇంకేం అంటుంది ? అనగలదు ?

* * *

రంగారావు, శ్యామలల వివాహం జరిగి నెలరోజులు కాకముందే జమీందారిణి రెండురోజులు మృత్యువుతో పోరాడి ఓడిపోయి వెళ్ళిపోయింది. ఇపుడు శ్యామల ఆ ఇంటికి - జమీకి - రంగారావుకి అందరికి రాణి, రంగారావు ఏడాది తరువాత చాలా నిశ్చింతగా, ప్రశాంతంగా, ఆనందంగా శ్యామల సహచర్యంలో రోజులు గడుపుతున్నారు. నిజానికి ఆయన మొదటి భార్య బతికి వున్నప్పుడుకూడా ఆయనిలా లేడు-కారణం రమాదేవి జమీందారు బిడ్డ-జమీందారు కుటుంబాలలో అలవాట్లు ఆ హోదాలప్రకారం ఆవిడ జమిందారిణిగా దర్జాగా బతకడానికి అలవాటు పడింది. ఓ గృహిణిగా, భర్త బిడ్డల అలన పాలనా స్వయంగా చూడడం జమిందారీ కుటుంబాలలో జరగదు—అన్నింటికి అందరికి వేరువేరు దాస దాసీలువుంటారు-భార్యా భర్తల అనుబంధం కేవలం రాత్రి మాత్రమే. ఆవిడ కాలక్షేపాలు, దాసీలు వేరు.ఆయన స్నేహితులు ఆయనవేట ఆయన మనుషులు వేరు. అలాంటి కనీసపుహోదాలు అంటి ముట్టని జీవితం గడిపిన రంగారావుకి శ్రీమతి స్వయంగా అన్ని పనులు చూస్తూ అనుక్షణం నీడలా అంటిపెట్టుకుని వుండడం ఆనందాన్నిచ్చింది. నిజమైన భార్యా భర్తల అనుబంధాన్ని రుచి చూసాక ఆయనకి శ్యామల పట్ల ప్రేమాభిమానాలు మరింత పెరిగాయి.

జీవితంలో ఎన్నడూ ఎదురు చూడని, ఆశించని ఈ భోగభాగ్యాలు - అభిమానించే భర్త- అనాధగా పెరిగిన తనకి యింత అదృష్టం పట్టిందంటే అప్పుడప్పుడు శ్యామలకే నమ్మకం కలగదు. హాయిగా, ఆనందంగా జీవిస్తున్న శ్యామలకి ఒకసారి అనాధ శరణాలయం చూసి రావాలన్న కోరిక రోజు రోజుకి పెరిగింది. పెళ్ళయ్యాక ధైర్యం చేసి తన మనసులో కోరిక రంగారావుతో వెళ్ళడించింది.

'తప్పకుండా వెళదాం' శ్యామలా, దానికింత సందేహం ఎందుకు-అసలు రెండేళ్ళనుంచి నేను వెళ్ళలేదు. నా గొడవలలో వుండిపోయి శరణాలయం సంగతిని మరిచాను. తప్పకుండా రేపే వెడదాం. కబురుచేస్తాను మనం వస్తున్నట్టు.

* * *

'అన్నపూర్ణ అనాధ శరణాలయం తెల్లనిగేటు సూర్యకిరణాల కాంతిలో ధగధగ మెరుస్తూంది, అంతకన్న మెరుస్తున్న నల్లని పెద్దకారు గేటులోంచి దూసుకు వెళ్ళింది. బాటకిరువైపులా ఉన్న రకరకాల సైజు పూలమొక్కలలాగే, రకరకాల సైజులో పిల్లలు నిలబడి చేతులు జోడించారు.

కారు తిన్నగా వెళ్ళి పోర్టికోలో ఆగింది. మేనేజరు కారు తలుపు స్వయంగా తెరిచారు. నల్లటి ఉలెన్ ప్యాంట్, తెల్లని జోధ్‌పురి కోటుతో, చేతికర్రతో రంగా రావు హుందాగా కారుదిగారు. వెనువెంట శ్యామలమెరిసే ఖరీయుదైన దుస్తులలోదిగింది. అక్కడ అనాధగా పెరిగింది అక్కడికే జమీందారిణి హోదాలో అడుగుపెట్టగానే శ్యామలకి, సిగ్గు, బిడియం, ఆనందం గర్వం ఎవేవో భావాలతో అడుగు తడబడింది. మొహం ఎర్రబడింది. అందరి నమస్కారాలు అందుకుంటూ రంగారావు పిల్లలగదులు, ప్రార్ధన మందిరం, భోజనశాల, వంటగదులు అన్ని తిరిగి చూశారు. తరువాత ఆవరణలో ఏర్పరచిన సభలో ఆశీనులయ్యారు. పిల్లలందరిని బాగా చదువుకోమనీ, క్రమశిక్షణ పాటించమని, శుభ్రంగా ఉండాలని ఉద్బోధించారు. తరువాత శ్యామల పిల్లలందరికి తల ఒక జత బట్టలు, మిఠాయి పంచిపెట్టింది. సభ ముగిశాక రంగా రావు ఆఫీసు రూములో జమా ఖర్చులు పరిశీలనలో మునిగిపోయారు.

అలాంటి అవకాశం చూస్తున్న శ్యామల నెమ్మదిగా అక్కడనించి జారుకుంది. శ్యామల బయటకు రాగానే పిల్లలంతా సందడిగా ఆమెని చుట్టుముట్టి "శ్యామలక్కా, శ్యామలక్కా" అంటూ ఆనందంగా పలకరించారు. శ్యామల అందరివంక అభి మానంగా చూసింది.

"తప్పు! శ్యామలక్క అని పిలవకూడదు ఇప్పుడు, ఆవిడ జమీందారిణి. అమ్మగారూ అనాలి!" పెద్దక్క సుగుణ తప్పు సవరించింది.

"సుగుణా! ఏమిటమ్మా ఆ మాటలు! నేను మీ పెద్దక్కనే ఎప్పుడూ. ఇక్కడ మీ అందరిమధ్య పెరిగి పెద్దానినయ్యాను మీతోపాటు. ఈనాడు ఆయన దయవల్ల అదృష్టం పట్టినంత మాత్రాన నేను మీకు అక్కనవనా!" సుగుణ భుజంమీద చెయ్యి వేసి ఆప్యాయంగా అందిశ్యామల. సుగుణ కళ్ళు తడి అయ్యాయి. "అక్కా! నీవెంత అదృష్టవంతురాలివి! ఎంతపుణ్యం చేసుకున్నావో! పోనీ! మాలో ఒక్కరికైనా ఇంత అదృష్టం పట్టిందంటే మాకెంత ఆనందంగా ఉందో తెలుసా! నిన్ను జమీం దారుగారు పెళ్ళాడారని విని ఎంత సంతోషించామో!"

పిల్లలంతా ఆశ్చర్యంగా కళ్ళువిప్పుకొని శ్యామల చీర ముట్టుకొని ఒకరు, రవ్వల గాజులు, మెరిసే ఉంగరం, కాళ్ళ జరీ చెప్పులు అన్నీ భయం భయంగా పట్టుకొని వింతగా కుతూహలంగా "అబ్బ! ఎంత బాగుందీ! అమ్మో, ఎలా మెరు స్తుందో!" అనుకొంటూ చూస్తుంటే శ్యామలకి బాధ అన్పించింది. ఆ నిర్భాగ్యులని

చూస్తుంటే తనంత అలంకరణతో వారి మధ్యకి రావడం సిగ్గనిపించింది. కాని రాణీ హోదాలో వస్తూ జమీందారుగారి తాహతుకి సరిపడని అలంకరణతో ఎలా రాగలదు- ఒక నిట్టూర్పు విడిచి "సుగుణా ఇక్కడ ఇప్పుడెలా వుంది పరిస్థితి ? అంతా సరిగా వుందా-మీకేం కావలసినా నాకురాయి సుగుణా-నేను జమీందారు గారితో చెప్పి మీ అందరికి మరిన్ని సదుపాయాలు జరిగేట్టు చూస్తాను. ఎప్పుడు ఏంకావాల్సినా ఈ అక్కని మరిచిపోవద్దు. సందేహించకుండా వెంటనే రాస్తే నేను చూస్తాను - నేను తరుచువస్తూ చూస్తూంటాను యిక్కడంతా సవ్యంగా వుండేట్టు—" శ్యామల ఆద రంగా అంది.

పిల్లలతో మాట్లాడుతున్నా శ్యామల దృష్టి లోపలకే వుంది. 'పదండర్రా నర్సరీలోకి వెళదాం - పాపలెలా వున్నారో చూద్దాం' అంది. శ్యామల వెంట పిల్ల లంతా వెంటబడ్డారు.

నర్సరీ హాలులో పిల్లలు నెలల నించి ఏడాది, రెండేళ్ళు, మూడేళ్ళ నించి ఐదు ఏళ్ళవరకు రకరకాలుగా వున్నారు. ఆమె చూపులు చాలా జాగ్రత్తగా ఎవరి కోసమో వెతుకుతున్నట్టున్నాయి. ఆ పాపలందరిమధ్య మంచంలో కూర్చుని ఆడు కుంటున్న రెండేళ్ళ పాపమీద ఆమెదృష్టి పడగానే శ్యామల మొహం విప్పారింది. తను వెతుకుతున్నది ఆ పాపే అని గుర్తించింది. ఆరాటం అణచుకుని యధాలాపం గానే అడుగులు వేసింది.

మిగతా పాపలందరికి భిన్నంగా చూడగానే ఆకర్షించేలా, చాలా తెల్లగా ముద్దుగా బాతుల మధ్య రాజహంసలా వుంది ఆ పాప. తెల్లటి కళ్ళు, నల్లటి ఒత్తు జుట్టు, మెరుస్తున్న పెద్దకళ్ళు, చూడగానే ఏ గొప్పింటి పిల్లో అన్పించక మానదు. పోషణ సరిగా లేక బలహీనంగా వున్నా, చవక దుస్తులలో వున్నా ఆ పిల్ల మొహం కళతో వెలిగి పోతుంది. శ్యామల ఆ పాప దగ్గరకి వెళ్ళి ఆగిపోయింది. ఆయా పున్నమ్మ వినయంగా నమస్కారం చేసింది. ఏం పున్నమ్మ బాగున్నావా ? అంటూ పాపని ఎత్తుకుంది. "అబ్బా ఎంత చక్కగావుందీ ఈ పాప. ఎప్పుడు దొరికిందర్రా" ఆరాటంగా అడిగింది, ఆ పాపని పరీక్షిస్తూ.

"అక్కా ....అక్కా....మరేమో ఈ పాప పేరు ఉష ..." పిల్లలు అంతా ఆరాటంగా చెప్పబోయారు సుగుణ అందరిని వారిస్తూ ఉష దొరికిన వైనం చెప్పింది. తెల్లారగట్ట దొరికిందని ఉష అని పేరు పెట్టాం. ఉష బాగుంది కదక్కా.

యిక్కడందరి లోకి ఉషే బాగుంటుంది అందుకే మనందరికీ ముద్దు. సుగుణ అంది-
"ఎవరికి పుట్టిందో.... ఏ గొప్పింటి పిల్లలాగో వుంది-ఆ తల్లికి చేతులు ఎలా వచ్చాయో ఇలాంటి బంగారం లాంటి పిల్లనిలా వదిలేయడానికి- వళ్ళు తెలియకుండా తిరగడం- యిలా పిల్లల్ని కని పారేయడం 'ఆయా కటువుగా అంది-
ఆ మాటలకి శ్యామల మొహం వివర్ణ మయింది.

"అలా అనకు... పాపం ఆ తల్లి కన్న బిడ్డని మరే గతి లేక వదిలేయాల్సి వచ్చినందుకు ఎంత బాధపడి వుంటుందో." పాపని ముద్దు పెట్టుకుంటూ అంది శ్యామల - ఆమె కళ్ళల్లో నీరు చిమ్మింది. శ్యామల బాధగా ఏదో అనబోయింది- యింతలో జమీందారుగారి పిలుపు వచ్చింది. శ్యామల పిల్లను మరొసారి ముద్దుపెట్టుకొని ఆయా కిచ్చి "పాపని జాగ్రత్తగా చూడు- సుగుణా వెళ్ళొస్తాను, నీకు చెప్పింది గుర్తుంచుకో- మీకేం కావల్సినా సందేహించక రాయి. మరి వస్తాను. వస్తా నర్రా- పిల్లలందరికి చెప్పి భారంగా కదిలింది. కారు కదులు తూంటే కల చెదిరినట్లు పిల్లలంతా దిగులు పడి నిలుచున్నారు.

* * *

ఆ రాత్రి శ్యామలకు చాలాసేపు నిద్రపట్టలేదు. పక్కమీద యిటు అటు దొర్లుతూ, ఆలోచనలతో సతమతమవుతూ, ఏదో చెప్పాలని ఆరాటపడుతూ, ఎలా చెప్పడం అన్న సంశయంతో నలిగిపోతున్నట్టు కనబడ్డ శ్యామలని వింతగా చూశారు రంగారావు. ఎప్పుడూ సంతోషంగా కలకలలాడే శ్యామల మొహం ఈరోజు అదోలా వుండడం ఆయన దృష్టిని దాటిపోలేదు.

"ఏం శ్యామలా - నిద్రపోవడం లేదూ" అన్నాడు మృదువుగా.

'ఊహూ- నిద్రరావడంలేదు యివాళ'.

'ఏం వంట్లో బాగుగాలేదా- అదోలా వున్నావు యివాళ.

'వంట్లో బాగానేవుంది'. శ్యామల నవ్వింది.

'మరి ?' శ్యామల ఏదో చెప్పాలని నోరు తెరిచింది. భర్త మొహంలోకి సూటిగా చూస్తూ 'నేనొకటి అడుగుతాను కాదనకుండా చేస్తారా ? ఆఖరికి అనగలిగింది. రంగారావు వింతగా చూశాడు. ఎప్పుడూ ఏ చీరలు, నగలుకొన్నా వద్దు వద్దు అనడం తప్ప ఏదీ నోరు తెరచి అడగని శ్యామల ఈ నాడు ఏదో కావాలనడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఏమిటది–అదుగు–నేను చేయగలిగింది అయితే చేస్తాను. రంగారావు అభయం యిచ్చాడు, శ్యామల ఒక్క క్షణం తటపటాయించి మనసులోమాట పైకి చెప్ప గలిగింది. ఆమాటకి రంగారావు ముందు ఒక్క–క్షణం ఆశ్చర్యపడి, తరువాత తేలిగ్గా నవ్వేశాడు.

"ఏం అప్పుడే పిల్లలమీదకి పోకుండా మనసు పెంచుకోవడం ఎందుకు ? నీకు పుట్టరని భయమా ? నేను అంత ముసలివాడిని కాను ఛలోక్తిగా నవ్వారాయన శ్యామల మొహం ఎర్రబడింది, సిగ్గుగా తలదించుకుని.........'అదికాదు – అదికాదు ఎందుకో ఆ పాప నాకు చాలా నచ్చింది. చాలా ముద్దుగా వుంది. మనకి కాస్త కాల క్షేపం అవుతుందని....' నసిగింది శ్యామల.

"బాగానేవుంది కానీ పెంచుకోవడం అంటే మాటలా – ఎందుకు వచ్చిన గొడవ – రేపు మనకి పిల్లలు పుడితే ఏం చేస్తాం బాగా ఆలోచించు లేనిపోని సమస్యలు కొని తెచ్చుకోడం ఎందుకు చెప్పు సాలోచనగా అన్నారాయన

"ఆలోచించడానికి ఏముంది మనకి పిల్లలు పుడితే ఆ పిల్లలతోపాటు పెరగ కూడదా ఉష ఆ ఒక్క–పిల్ల మనకి బరువవుతుందా యింట్లో యింతమంది వుండగా. రంగారావు ఆలోచనలో పడ్డారు. సరే నీకింత ముచ్చటగా వుంటే నాకేం అభ్యంతరం లేదుగాని, అయినా అంతమంది వుండగా ఆ పాపమీదే నీకెందుకంత మక్కువ ? శ్యామల మొహంలోకి చూశారాయన, శ్యామల జవాబు రానట్టు తడబడింది. ఒక్క క్షణం "చెప్పానుగా అందరికంటె ఆ పిల్ల ముద్దు వస్తుందని ఎవరో గొప్పింటి పిల్లలాగే వుంది. అంత చక్కని పాప అలా అనాధగా పెరుగుతూంటే నాకేమిటో కష్టంగావుంది" అంది. రంగారావు శ్యామలవైపు ఒక్క–క్షణం అభిమానంగా చూశారు. ఆమె మంచిమనసుకి, దయార్ధ హృదయానికి మెచ్చుకుంటున్నట్టు ప్రేమగా చేయివేసి దగ్గరకు లాక్కుని" నీయిష్టం కాదంటానా శ్యామలా అలాగే రేపే వెళ్ళి ఉషని తీసు కొస్తాను అన్నారు, శ్యామల సంతృప్తిగా ఆయన కౌగిలిలో కరిగిపోయింది.

* * *

ఉషని తీసుకొచ్చి నెలరోజులు గడిచింది. ఈ నెలరోజులనించి శ్యామలకి ఉషతో బాగా కాలక్షేపం అవుతూంది. ఆమె ఆటపాటలు, ముద్దుముచ్చట్లు చూస్తూ– రకరకాల గౌనులు తొడిగి ముస్తాబు చేస్తూంటే తీరికి చిక్కినంత కాలక్షేపం అవసా గింది–అన్నాళ్ళు పోషణలేక చిక్కిపోయి వుండే ఉష ఈ నెలరోజులకే బొద్దుగా

తయారైంది. రంగు మిసమిస లాడసాగింది. దానికితోడు చక్కని బట్టలు తొడగగానే ఏ జమీందారు బిడ్డలాగానో వుండి. అంతవరకు కసుర్లు,విసుర్లు తప్ప ఆదరణ,ఆప్యాయత, అనురాగం ఎరుగని ఆ రెండేళ్ళ ఉషకి కూడా శ్యామం చూపే అనురాగం, ముద్దు అర్థమై నెలరోజులకే శ్యామలకి బాగా చేరిక అయి అమ్మా_అమ్మా అంటూ ఎప్పుడు విడవకుండా తిరిగేది. అప్పుడప్పుడే వస్తున్న ముద్దుమాటలతో అందంగా వున్న ఉషనిచూస్తే రంగారావు ముచ్చటపడ్డాడు. రంగారావుని శ్యామల 'డాడీ' అని పిలవమని ఉషకి నేర్పింది. ముద్దుగా 'డాడీ' అంటూ దగ్గిరగావచ్చే ఉషనిచూస్తే ఆయనకీ చాలా ప్రేమకల్గింది. ఎన్నాళ్ళ తరువాత యింట్లో చంటిబిడ్డ ఆట పాటలు చూస్తుంటే చాలా తేలిగ్గానే నెలరోజులకే ఉషపట్ల అనుబంధం ఆత్మీయత ఏర్పడ్డాయి రంగారావుకి. ఉషని చూస్తుంటే_ఆ పసిపాప కళ్ళల్లో కాంతి చూస్తుంటే ఆయనకి ఎవరోతెల్సిన మొహంలా కనిపించేది. 'శ్యామలా-ఉషని చూస్తుంటే నాకు తెల్సిన ఎవరి పోలికో కనిపిస్తూంది_నీకేమని పిస్తూంది- ఎవరి పోలిక అంటావు' అన్నారు ఓరోజు. శ్యామలకా స్త తడబడి సరుకుని నవ్వేసింది." బాగుంది_ఎవరిబిడ్డో అనాధగా పెరిగింది. ఆమె ఎవరిపోలికో నాకేం తెలుస్తుంది" అంది.

"ఊహు_కాదు_ నాకు బాగా తెలిసిన వాళ్ళపోలికలున్నాయి. కాని....ఎవరు ? ఎక్కడచూశాను, అన్నది గుర్తురావడంలేదు" అన్నారు. శ్యామల యింక మాటలు పెంచే అవకాశం యీయకుండా ఏదో పనున్నట్టులేచి వెళ్ళిపోయింది.

"ఉష వచ్చిందగ్గరనించి నన్ను మరిచి పోతున్నావు_రోజంతానీకు ఉషతోటే సరిపోతూంది" అనేవారు రంగారావు నవ్వుతూ. శ్యామల రాత్రి పడుకోడానికి ఆలశ్యంగా వస్తే "వుంచుకున్న బిడ్డమీదే నీకింత ప్రేమయితే_రేపు నీకుపుడితే ఇంక అసలు నన్ను చూడవు గాబోలు" అనేవారు. "కన్న ప్రేమకన్న పెంచిన ప్రేమ గొప్పదంటారు మీకు తెలియదా" అనేది వచ్చి-మొత్తంమీద యిద్దరికీ ఉష ఎక్కడ వించో తెచ్చి పెంచుకుంటున్న పిల్లలా అన్పించలేదు,

* * *

ఉదయం పదకొండు గంటలవేళ శ్యామల పనులన్నీ ముగించుకుని తీరిగ్గా ఉషతో బొమ్మలుపెట్టి ఆడిస్తుంది. రంగారావు ఎవరో పెద్దమనుషులు వస్తే మాట్లాడు తున్నారు. దాసీది వచ్చి 'అమ్మా - ఎవరో అతను వచ్చి మిమ్మల్ని చూడాలంటున్నాడు ? అంది.

'నన్నా.... నన్ను చూడాలంటున్నాడా ఎవరతను ?' ఆశ్చర్యంగా అడిగిం శ్యామల. తెలీదమ్మా-పేరయినా చెప్పలేదు. మిమ్మల్ని కలిసి మాట్లాడాలంటున్నాడు? శ్యామల ఆశ్చర్యంగా 'బాబుగారున్నారు చూడమనక పోయావా ?'.

"చెప్పాను- అయ్యగారితో కాదు అమ్మగారితో పని అన్నాడు."

శ్యామలకు కుతూహలం తొంగి చూసింది "సరే-నా డ్రాయింగు రూమ్‌కి పంపు యిప్పుడే వస్తున్నాను" అంది. శ్యామల జమీందారిణి హోదాలో ఆ గదికేసి నడిచింది, అక్కడ ఓ నలభై నలభై ఐదు సంవత్సరాల మనిషి వున్నాడు, వేషం బీదరికాన్నే సూచిస్తుంది. మాసిన కాకీ పాంటు, షర్టు వేసుకున్నాడు. జుట్టు బాగా పెరిగి దుబ్బులా వుంది. తాగినట్లున్న ఎర్రటి కళ్ళు, మాసిన గడ్డం, వేషం చూడగానే కింది తరగతి మనిషని చెప్పవచ్చు-అతనెవరో చూసినగుర్తు అన్నాలేదు శ్యామలకి. ఆ అగంతకుడికి తనతోఏం పనికూడా అర్థంకాలేదు. ఒకసారి అతన్ని పరీక్షగా చూసి" ఎవరు నువ్వు? ఏం కావాలి ? అంది అధికార యుతంగా.

"మీతో ఒక్క విషయం మాట్లాడాలని వచ్చాను, అతను ఏమాత్రం సంకోచం, భయం,మర్యాద లేకుండా కాస్త పొగరుగా నిర్లక్ష్యంగా మాట్లాడాడు. ఆ అవిధేయత, ఆ మాట కరుక్క- శ్యామల మొహం ఎర్రబడింది. గంభీరంగా" మాట్లాడదలచింది. జమీందారుగారితో చెప్పు నాతోనీకేం పని? అంది నుదురు చిట్లించి "జమీందారు గారితో నాకేం పని లేదు. మీతోనేవుంది, అన్నాడు ఆదోలా నవ్వి, శ్యామల మరింత ఆశ్చర్యపడింది. అనుమానంగాచూస్తూ సరే అదేమిటో తొందరగా చెప్పు ?' అంది. ఆతను యిటు అటు చూసి అక్కడే నిలబడిన దాసివైపు చూసిశ్యామలవంకతిరిగి ఇక్కడింకెవరూ వుండకపోవడం మీకే మంచిది అన్నాడు. శ్యామల ఈసారి మరింత అశ్చర్యపోయింది. అనుమానంగా చూసింది అతనివంక. ఇతని విషయం వింతగా వుంది అనుకుంటూ అదేమిటో తెలుసుకోవాలన్న కుతూహలం ఆమెని తొందర పెట్టింది.

"లక్ష్మి నీవు వెళ్లు - తలుపులు మూసివెళ్ళు అంది శ్యామల. దాసీది వెళ్ళాక ఊ....యింక చెప్పు త్వరగా, అవతల నాకు పనివుంది" అంది తీక్షంగా. అతను ఒక్కసారి గొంతు సవరించుకుని "పాప సంగతి మాట్లాడాలని వచ్చాను" అన్నాడు శ్యామలవంక సూటిగా చూస్తూ -శ్యామల తెల్లపోయింది.

"పాప-ఏ పాప?" అంది.

"అదే....అనాథశరణాలయంనించి మీరు తెచ్చిపెట్టుకున్న ఉష గురించి...."

"ఉష గురించా?... శ్యామల ఆశ్చర్యంగా చూసింది" "ఉష గురించి ఏం మాట్లాడుతావు?" అర్థం కానట్టు అంది.

"అదే-ఉష ఎవరో నాకు తెలుసునని-ఉష సంగతి జమీందారుగార్కి తెలియదని-అయన దగ్గిర ఈ విషయం దాచి ఉషని నీవు తీసుకొచ్చావని, నాకు తెలుసునని చెప్పడానికి వచ్చాను" అవోలా విషపు నవ్వునవ్వి అన్నాడు అతను. శ్యామల బిత్తరపోయింది. అతనివంక వెర్రిదానిలా చూసింది ఒక్కక్షణం. "నీకు.. నీకెలా తెలుసు ఈ విషయం?" తడసద్తూ అడిగింది. అతను అదోలా తలెగరేసి నిర్లక్ష్యంగా నవ్వాడు.

"ఎలా తెలిస్తేనేం-నాకు అంతా తెలుసు" శ్యామల మెదడు ఒక్కక్షణం శూన్యం అయింది, అంతలోనే నిలదొక్కుకుంది. అతనంత నిర్లక్ష్యంగా అమర్యాదగా మాట్లాడుతుంటే కోపం వచ్చింది-సాధ్యమైనంత తడబాటు అణుచుకుని "అయితే ఏమిటంటావు?" అంది గంభీరంగా.

"జమీందారుగారికి ఈ సంగతి నేను చెప్పకుండా వుండాలని మీరనుకుంటే నాకు వెయ్యి రూపాయలు ఇయ్యాలి" విలాసంగా అన్నాడు అతను. శ్యామలమొహం ఎర్రబడింది "బ్లాక్ మెయిల్ చేయడానికి వచ్చావా?" అంది.

"నాకు డబ్బవసరం వుంది. మీకీ రహస్యం పైకి పొక్కడం యిష్టంలేదు. అలా ఆయనకి తెలియకుండా వుండాలంటే మీరు డబ్బివ్వక తప్పదు. దీన్ని బ్లాక్ మెయిల్ అన్నా మరొకటి అన్నా మీ యిష్టం" నిర్లక్ష్యంగా శ్యామల ఎదుటే బీడీతీసి వెలిగించుకున్నాడు. శ్యామలకి ఉద్రేకం ఆగలేదు. కాని ఏంచెయ్యాలో ఆ క్షణాన తోచలేదు. తొందరపడి ఉద్రేకపడి లాభం ఏమిటని వివేకం హెచ్చరించింది. అయినా నిబ్బరంగానే నిలదొక్కుకుని "డబ్బీయకపోతే ఏం చేస్తావు?" సూటిగా అడిగింది.

"చెయడానికి ఏముంది? నాకు తెల్సిన రహస్యం జమీందారుగార్కి చెప్పి వెడతాను?"

"చెపితే నీకు కలిగే లాభం ఏమిటి?"

"నాకు లాభం లేకపోయినా నీకు నష్టం అన్న సంగతి నీకు తెలుసు, అసలు సంగతి జమీందారుగార్కి తెలిస్తేనీ వీ రహస్యం దాచి ఆయన్ని మోసం చేసినం

దుకు ఆయన వూరుకుంటారనుకున్నావా ? తర్వాత నీగతి ఏమవుతుందో ఆలోచించుకో!" శ్యామల ఎంత నిబ్బరం నటించినా ఆమె కళ్ళల్లో వణుకు ఆరంభించింది. గుండెల్లోదడ వళ్ళంతా చెమట పట్టింది. ఒక్క క్షణం ఆలోచించి సరే డబ్బిచ్చాక కూడా నీవు ఆయనతో చెప్పవని నమ్మకం ఏమిటి ?" అంది.

"చెప్పను నాకు కావలసింది డబ్బు ఆ డబ్బు ముట్టాక నీవేం చేస్తే నాకేం అవసరం" శ్యామల ఒక్కక్షణం తటపటాయించి లోపలికి వెళ్ళింది. వెయ్యి రూపాయలుతీసుకొచ్చి యిచ్చిజాగ్రత్త మళ్ళీ యీచుట్టుపక్కల కనిపించావంటే వూరుకోను. ఈ రహస్యం పైకి వచ్చిందంటే నీవల్లేనని నాకు అర్థం అవుతుంది. అప్పుడు నేనేమైనా నిన్నుమాత్రం ఉపేక్షించను బ్లాక్‌మెయిల్ చేస్తున్నావని జైల్లో పెట్టిస్తాను. అర్థమైందా వెళ్ళు యిక్కడనించి మళ్ళీ నా ఎదుటికిరాకు ఎప్పుడూ?" తిరస్కారంగా, తీక్షణంగా తలుపు మూసింది శ్యామల. అతను ఒక నవ్వునవ్వి బయటకి వెళ్ళాడు.

శ్యామల సోఫాలో వాలిపోయి తల పట్టుకుంది. ఎదురు చూడని ఈ హఠాత్ సంఘటనకి ఆమె ధైర్యం సడలి పోయింది.

* * *

ఆ రోజంతా శ్యామల మనస్సు పాడయింది. బ్లాక్‌మెయిల్‌కి అలవాటు పడినవాడు ఒకసారితో వదులుతాడా ? మళ్ళీ మళ్ళీ వస్తుంటే ఎన్నిసార్లు తను డబ్బు ఈయగలదు ? రంగారావుకి తెలియకుండా ఎంత డబ్బు ఖర్చుపెట్టగలదు ? అసలు ఈ మనిషి ఆయన కంట పడితే ఎంత ప్రమాదం ? యిలా చాటు మాటుగా అతను వస్తూ పోతూవుంటే పనివాళ్ళు ఏమను కుంటారు. అసలింతకీ ఈ విషయం అతనికెలా తెల్సింది ? అసలతను ఎవరు ? రంగారావుకి ఈ విషయం తెలిస్తే తనెలాంటి పర్యవసానాన్ని ఎదుర్కోవాలి. ఆయన దగ్గిర ఈ విషయం దాచి నందుకు ఎంత మాత్రం క్షమించరు ! కాని- ఎలా చెప్పడం ? చెబితే క్షమిస్తారా ?.

ఎంత ఆలోచించినా శ్యామలకి ఏం చెయ్యాలో అర్థం కాలేదు. తన కర్తవ్యం తట్టలేదు. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవలసి వుంటుందని ఊహించని శ్యామల మనసంతా ఈ సంఘటనతో అల్లకల్లోలమైంది. ఇలాంటి పరిస్థితిలో చిక్కుకున్నందుకు తనకి తాను నిందించు కుంది.

ఆఖరికి సరే "చూద్దాం ఏమవుతుందో- మరోసారి వస్తాడో లేదో."

శ్యామల అనుమానం నిజమే అయింది. మళ్ళీ నెల గడిచేసరికి రెండోసారి

తయారయ్యాడు అతను. ఈసారి శ్యామలమీద దయ తలచినట్టు ఐదొందలతో సరి పెట్టాడు. శ్యామల కోపం పట్టలేకపోయింది. శ్యామల కోపానికి, ఆమె బెదిరింపులకి దడవనట్టు నిర్లక్ష్యంగా నవ్వి వెళ్ళిపోయాడు అతను.

శ్యామల దిగులు, ఆరాటం హెచ్చయింది ఆ సంఘటనతో, ఎవరితో ఈ విషయం చెప్పుకోవాలో కూడా అర్థం కాలేదు. రంగారావుతో ఈ విషయం ఎలా చెప్పాలో—చెప్పకుండా ఎన్నాళ్ళు దాచగలదు తను అన్నది ఆమెకి పెద్ద సమస్యగా తయారయింది.

ఆ సమస్యకి పరిష్కారం అతి కొద్ది రోజులలోనే జరిగిపోయింది.

* * *

ఆరోజు ఊరికివెళ్ళిన రంగారావు అనుకోకుండా ఒకరోజు ముందు వచ్చారు. శ్యామల అలవాటుగా ఎదురుకాలేదు గుమ్మంలోకి. బెడ్ రూములోకి వెళ్ళారు. అక్కడ లేదు. ఉషను ఆడిస్తున్న ఆయాని 'అమ్మగారెక్కడ' అన్నారు రంగారావు.

"ఎవరోవస్తే అమ్మగారు పుస్తకాల గదిలో మాట్లాడుతున్నారు బాబూ" అంది ఆయా వినయంగా.

"ఎవరు ? ఆడా – మగా ?"

"ఎవరో మొగవాడేనండి" రంగారావు ఎవరా అని ఆశ్చర్యపడి, ఎవరో చూద్దామని లైబ్రరీ వైపు నడిచాడు. గది తలుపులు ఓరగా వున్నాయి. గదిలో శ్యామల గొంతుతో మరో అపరిచితుడి గొంతు వినిపించింది. ఆ మాటలు చెవినపడగానే అప్రయత్నంగా గుమ్మంముందు ఆగిపోయారు రంగారావు.

"నిజం జమీందారుగారికి తెలిస్తే మీ యిద్దరి గతి పాప భవిష్యత్తు ఏమవుతుందో తెలుసా? మర్యాదగా నేనడిగింది యిచ్చేస్తే యీ రహస్యం బయటికిపొక్కదు" మొగ గొంతు.

"యిప్పటికి రెండుసార్లు అయింది. ఇలా యిస్తున్నంతకాలం నువ్వు మళ్ళీ మళ్ళీ అడగవని నాకు ఏమిటి నమ్మకం" శ్యామల గొంతు తీక్షణంగా వుంది"

"ఇక రాను మాట యిస్తున్నాను."

"నిన్నే నమ్మమని ఎక్కడుంది ఛీ నీవింత దుర్మార్గుడవని అనుకోలేదు. నన్నెందుకిలా పీడిస్తావు, నీకు నేనేం అపకారం చేశాను, పాప మీద నీకెందుకింత పగ"

ఆ మాటలు విన్న రంగారావుగారు ఒక్కక్షణం వింటున్నది ఏమిటో అర్థం కానట్టు నిలబడ్డారు. మరుక్షణం ఆయన మొహం నల్లబడింది. ఆయనకి తెలియకుండానే గదిలోకి అడుగువేశారు. ఆయన్ని అలా అనుకోకుండా హఠాత్తుగా చూసిన ఇద్దరూ నిశ్చేష్టులైపోయారు. శ్యామల పై ప్రాణాలు పైనే పోయాయి:

రంగారావు యిదరి వంక ఒకసారిచూసి "ఏమిటిది ఏమిటా రహస్యం ?" గంభీరంగా అడిగారు. తుఫాను ముందు ప్రశాంతతలా నిశ్చలంగా గంభీరంగా అడిగా రాయన.

అతను శ్యామలవంక, ఆయన వంక చూసి మరుక్షణం అక్కడనించి పారిపో బోయాడు.

"అడుగు కదిపావంటే నరికేస్తాను, ఆరహస్యం ఏమిటో చెప్పు" రంగారావు గుమ్మానికి అడ్డంగా చేతులుపెట్టి గంభీరంగా అడిగారు.

అతను ఒక్కక్షణం నిస్సహాయంగా చూసి తడబడ్డూ "ఉష అనాధకాదు–ఆవిడకి తెలుసు–గట్టిగా అడగండి ఆమే చెప్తుంది" అంటూనే ఆయన పక్కనించి దూసుకుపోయాడు.

రంగారావు ఒక్క క్షణం తెల్లపోయి, తేరుకుని చూసేసరికి శ్యామల కూడా లేదక్కడ.

* * *

రాబోయే ప్రళయాన్ని ఊహించి ఆ రోజంతా శ్యామల రంగారావుగారి నించి మొహం చాటుచేసుకు తిరిగింది. ఆయనకి వంటరిగా కనపడకుండా జాగ్రత్తపడింది. ఆయనకి కోపం విజృంభిస్తే తట్టుకు నిలబడ్డం కష్టం అని ఎందరి నోటో వింది. కాని అలాంటి పరిస్థితి అప్పటి వరకు ఆమెకి తటస్థపడలేదు. కాని యిప్పుడు....శ్యామల కేం చెయ్యాలో, ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో అంతుబట్టలేదు. కాని ఆశ్చర్యంగా రంగారావు ఆ విషయం మరిచిపోయినట్టు – ఏం జరగనట్టు గంభీరంగా వుండిపోయాడు రోజంతా.

ఆ రాత్రి బాగా పొద్దుపోయాక ఆయన పడుకుని వుంటారన్న నమ్మకంతో చడి చప్పుడు లేకుండా గదిలోకి ప్రవేశించింది శ్యామల. మెల్లిగా నడిచి మంచం చేరేంతలో లైటు వెలిగింది – ఆమె బిత్తరపోయింది. రంగారావు సోఫాలో కూర్చుని వున్నారు. శ్యామల వంక ఒక్క క్షణం పట్టి పట్టి చూశారు–

"నీ కోసమే చూస్తున్నాను. ఇంతాలస్యం చేశావేం?" ఆయన గొంతు ప్రశాంతగా వుంది. తుఫాను ముందు ప్రశాంతి అనుకుని చిన్నగా వణికింది శ్యామల.

"ఉషని పడుకోబెడుతున్నాను" తడబడ్తూ జవాబిచ్చింది.

"రా, ఇలా కూర్చో-" ఒక సోఫా చూపారాయన. ఆమె ఊహించినకోపావేశానికి బదులుగా ఈ శాంతం, సౌమ్యత ఆమె నింకా బెదిరిస్తున్నాయి. అలజడితో సోఫాలో ముడుచుకు కూర్చుంది. రంగారావు గంభీరంగా శ్యామల వంక చూశాడు.

"శ్యామలా- నీవు అందమైన దానివని, తెలివైనదా నివన్న సంగతి తప్పించి నీ గురించి గానీ, నీ పుట్టు పూర్వోత్తరాల గురించి గాని నాకేం తెలియదు. తెలుసుకోవాలని ప్రయత్నమూ చెయ్యలేదు. అయినా నీపై నమ్మకముంది, నీ ప్రవర్తన మీద విశ్వాసంతో నిన్ను పెళ్ళాడాను వంశ ప్రతిష్టలకి ప్రాణం పెట్టే నేను నీ కోసం అవన్నీ తృణ ప్రాయంగా ఎంచి నిన్ను చేపట్టాను. నా యెడల నీ కెలాంటి భావం ఉన్నా లేకపోయినా, కేవలం మానవ ధర్మంగా నేనుంచిన నమ్మకానికి, విశ్వాసానికి బదులివ్వాలి నువ్వు- అవునంటావా?" అతి సున్నితంగా, మెత్తగా మొదలైన ఈ సంభాషణ యెక్కడికి దారి తీస్తుందో గ్రహించి వణికింది శ్యామల- ఆయన వంక చూడలేక తల వాల్చుకుంది.

"ఉష యెవరు? ఈసారి ఆయన గొంతు మరింత గంభీరమైంది. శ్యామల మట్లాడలేక పోయింది.

"ఇప్పుడింకా మాటలు మింగి ప్రయోజనం లేదు- రహస్యం దాచి లాభం లేదు. నేనేదో ఒక నిర్ణయానికి వచ్చేలోపల నువ్వు చెప్పదలచింది చెప్పడం మంచిది. ఆ తరువాత విచారించినా ప్రయోజనం లేదు.

శ్యామల కళ్ళలో నీరు తిరిగింది.

"ఉష ఎవరోనీకు తెలుసన్నసంగతి తెలుస్తూనేవుంది. మధ్యాహ్నం జరిగింది చూశాక, విన్నాక ఏమాత్రం బుద్ధివున్నవాడికన్నా అర్థం అవుతుంది. ఇంక యిప్పుడు నేను అడిగేది అది ఎవరికి పుట్టిందని కరకుగా అడిగారు శ్యామల ఒక్కసారి తలెత్తి చురుకుగా చూసింది. కళ్ళు నీటి పొరలతో మెరిశాయి.

"మీరు ఊహించినది సరిగాదు-పొరబడుతున్నారు."

"హుం-పొరపాటు యిప్పుడు పడడం ఏం-నిన్ను పెళ్ళాడి నప్పుడే పొరపడాను. మొఖాన్ని, మాటలని చూసి మోసపోయాను. నీ అందం లాగే నీ మనస్సు

నీ గతం నిర్మలమైనదని అనుకోడం పొరపాటుగదూ? మట్టిలో అణిగిపోయిన వజ్రా నివే అనుకున్నానుగాని నీ నిజరూపం బొగ్గని మరిచిపోవడం పొరపాటు గదూ? కానిలే, అయిపోయిందానికి బాధపడే మనిషినిగాను నేను—" పరిస్థితి క్రమంగా మారుతోంది. రంగారావు గొంతూ కఠినంగ, తీవ్రం అవుతూంది.

"మీరు నన్ను అపార్థం చేసికోకండి. ఇందులో నన్ను శంకించవలసింది ఏమిలేదు. నేనే పాపం ఎరుగను–నామాట నమ్మండి" శ్యామల దీనంగా అంది.

"ఉష ఎవరు? రోడ్లంట తిరిగే ఆ రౌడి కూతురేనా? ఈ రహస్యం దాచ డానికి యింతవరకు ఎంత డబ్బు తగలేశావు?" తీక్షణంగా చూశాడు రంగారావు.

శ్యామల దీనంగా, నిస్సహాయంగా చూసింది "ఉష ఎవరో చెప్పలేను, చెప్ప నని ఒకరికి మాటిచ్చాను. దయచేసి ఆ సంగతి అడక్కండి మీనించి దాచాలనిగాదు. కాని చెప్పగలిగే శక్తి నాకులేదు, నిజం చెపుతున్నాను. ఉషకి తల్లి దండ్రులులేరు ఉష మనింటికి వచ్చేదాక అతదెవరో నాకసలు తెలియదు " రంగారావు హేళనగా నవ్వారు.

"శ్యామలా అబద్ధం అడినా అతికినట్లుండాలి. అతదెవరో తెలియకుండా నే రెండుసార్లు డబ్బిచ్చావన్నమాట. శ్యామలా యింకా నన్నెందుకు నమ్మించ చూస్తావు ఎందుకు యింకా వంచిస్తావు 2 అయన గొంతు కంపించింది.

"భగవంతుడి సాక్షిగా చెపుతున్నాను అతనికి నాకు ఏ సంబంధంలేదు. దయచేసి నన్నర్థం చేసుకోండి తొందరపడి అనుమానించకండి నన్ను."

"అయితే ఉష ఎవరో చెప్పు ?"

శ్యామల నిస్సహాయంగా చూసింది. కొద్ది క్షణాలు ఆమె జవాబుకి ఎదురుచూసి "సరే ఇంక మాట్లాడవలసింది ఏమీలేనట్టు లైటార్పి మంచంమీద పడుకున్నారు రంగారావు. ఆయనకి బాగా కోపం వచ్చిందన్న సంగతి శ్యామలకి అర్థమైంది. కాని అప్పటికి ఆ గండం గడిచినందుకు సంతోషించింది.

* * * *

కాని–

ఆ సంతోషం తెల్లవారేసరికి మాయమయింది–

ఉదయం శ్యామల నిద్రలేచేసరికి ఆయనింకా లేవలేదు, శ్యామల మామూలు అలవాటు ప్రకారం కాలకృత్యాలు తీర్చుకుని, పూజ ముగించి, ఓ గంట పోయాక